సాక్షి విశాఖపట్నం

బుధవారం । 29 । నవంబర్ । 2023



బడుగుల ఆశాజ్యోతి పూలే

బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. 8లో



పథకాల అమలులో...

పక్కాగా కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని దిశ అధ్యక్షురాలు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి సూచించారు. 8లో



హోటళ్లలో విజిలెన్స్ దాడులు

నగరంలోని రెండు హోటళ్లలో శనివారం ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.4 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 42 రోజులకు గాను 2 కోట్ల 40 లక్షల 34వేల 556లు వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై పిలిగ్రిమ్స్ సెంటర్‌లో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించగా నగదుతోపాటు 148.500 గ్రాముల బంగారం, 17.700 కిలోల వెండి వచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ లభించినట్టు పేర్కొన్నారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునరుద్ధరణ



కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత సేవలను మంగళవారం నుంచి పునరుద్ధరించారు. తిరునక్షత్రం పూజలు సందర్భంగా ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు. తిరునక్షత్రం పూజలు ముగియడంతో తిరిగి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. మంగళవారం ఉదయం నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను మండపంలో వేంజేపచేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అర్చకులు అందజేశారు.

సమ్మేటివ్ పరీక్షలు ప్రారంభం



అక్కయ్యపాలెం మున్సిపల్ స్కూల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో సమ్మేటివ్-1 పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి లాంగ్వేజీ పరీక్ష జరిగింది. ఒకటి నుంచి 6వ తరగతి, 8, 10వ తగరతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, 7, 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.30 నుంచి 4.45 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 1,389 పాఠశాలల్లో పరీక్షలు సజావుగా ప్రారంభమైనట్లు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి కృష్ణ మోహన్ తెలిపారు. ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన ప్రశ్నా పత్రాలతోనే ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలో పరీక్షలు నిర్వహించారు. సబ్జెక్టు టీచర్లు ఎప్పటికప్పుడు జవాబు పత్రాలను మూల్యాంకనం పూర్తి చేసేలా ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. ప్రైవేటు స్కూళ్లలోనూ తప్పనిసరిగా టైంటేబుల్ మేరకు పరీక్ష నిర్వహించాలని ఆదేశించారు.

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: భద్రతాపరమైన పనుల వల్ల కొత్తవలస-కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

- విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 29 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈ నెల 30 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.







తీరంలో రణరంగం

సాగర తీరంలో ఆకట్టుకున్న నేవీ డే సన్నాహాలు

ప్రశాంతమైన సాగర తీరంలో మంగళవారం సాయంత్రం యుద్ధ వాతావరణం నెలకొంది. బాంబుల మోత మోగింది. యుద్ధ విమానాలు దూసుకుపోయాయి. అదేంటి.. ఇప్పుడు ఏ యుద్ధం లేదే అనుకుంటున్నారా...? ఏటా డిసెంబర్ 4న జరిగే నేవీ డే సన్నాహాల్లో భాగంగా మంగళవారం నుంచి విన్యాసాలు జరుగుతున్నాయి. నిజంగా యుద్ధం జరిగితే ఎలాంటి పరిస్థితి ఉంటుందో.. అచ్చం అలాంటి వాతావరణమే ఆర్కే బీచ్‌లో సృష్టించారు. యుద్ధ సమయంలో సైనికులు ఎంత వేగంగా స్పందిస్తారు.. శత్రు సేనలతో వీరోచితంగా ఎలా పోరాడుతారో కళ్లకు కట్టినట్లు చూపించారు. హెలికాప్టర్ ద్వారా ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడం, తీవ్రవాదుల దాడులను ఎదుర్కోవడం వంటివి ప్రదర్శించారు.

- బీచ్‌రోడ్డు



దూసుకొస్తున్న యుద్ధ విమానాలు





సిద్ధమవుతున్న ప్రధాన వేదిక



బాంబుల మోతతో దద్దరిల్లిన సాగరతీరం












ఆసక్తిగా తిలకిస్తున్న యువతులు



ఆటోనగర్‌గా 'కణమాం'!

- ఈ ఎంఎస్‌ఎంఈ పార్కుకు 157.77 ఎకరాల కేటాయింపు
- భూమిని ఏపీఐఐసీకి స్వాధీనం చేసిన రెవెన్యూ శాఖ
- త్వరలో లేఅవుట్ వేసేందుకు సన్నాహాలు



కణమాంలో ప్రతిపాదిత ఎంఎస్‌ఎంఈ పార్కు స్థలం

సాక్షి, విశాఖపట్నం: ప్రతిపాదిత కణమాం ఎంఎస్‌ఎంఈ పార్కును ఆటోనగర్‌గా మార్పు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆనందపురం మండలం కణమాం గ్రామం వద్ద ఇప్పటికే ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ పార్కు కోసం 157.77 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కూడా కేటాయించింది. ఈ భూమిని రెవెన్యూ శాఖ ఏపీఐఐసీకి ఇటీవల స్వాధీనం చేసింది. ఈ నేపథ్యంలో ఏపీఐఐసీ అధికారులు ఆ భూమిని చదును చేయించే పనిని చేపట్టారు. అక్కడ లేఅవుట్ వేసేందుకు అంచనాలు రూపొందించారు. ఇందుకు అనుమతి కోరుతూ ఏపీఐఐసీ ఉన్నతాధికారులకు ఇటీవల లేఖ రాశారు. అటు నుంచి అనుమతులు రాగానే లేఅవుట్ ప్రక్రియను చేపట్టనున్నారు. అలాగే అక్కడ కొత్తగా యూనిట్ల స్థాపనకు ముందుకొచ్చే వారికి 200, 500, 1,000 గజాల చొప్పున ప్లాట్లను కేటాయించాల్సి ఉంటుంది. వాటి విస్తీర్ణంతో పాటు ధరను నిర్ణయించాల్సి ఉంది. ఇక తొలుత అక్కడ ఎంఎస్‌ఎంఈ పార్కు కింద అభివృద్ధి చేస్తారు. సాధారణంగా ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో వివిధ రకాల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కేటాయిస్తారు. కణమాం పార్కులో ఆటోనగర్‌గా మార్పు చేసేందుకు వీలుగా పెద్ద సంఖ్యలో ఆటోమొబైల్ పరిశ్రమలను మంజూరు చేయనున్నారు. ఇందులో ఆటోమొబైల్ యూనిట్ల ఏర్పాటుతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు కూడా అనుమతించనున్నారు.

స్క్రాప్ దుకాణాల తరలింపు : ఇప్పటికే స్మార్ట్ సిటీగా విరాజిల్లుతున్న విశాఖ నగరాన్ని స్క్రాప్ ఫ్రీ సిటీగా మార్చాలన్న నిర్ణయానికొచ్చారు. ఇందులో భాగంగా నగర పరిధిలో ఉన్న పలు స్క్రాప్ (ఇనుప తుక్కు) దుకాణాలను కూడా అక్కడకు తరలించనున్నారు. నగర పరిధిలోని తగరపువలస నుంచి గాజువాక వరకు జాతీయ రహదారికి ఆనుకుని అనేక స్క్రాప్ దుకాణాలున్నాయి. వీటితోపాటు పెందుర్తి, ఎండాడ, ఇసుకతోట, టౌన్‌కొత్తరోడ్డు, కోటవీధి, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోనూ వెరసి 1300 వరకు ఇవి నడుస్తున్నాయి. ప్రతిపాదిత కణమాం ఆటోనగర్ ఆనందపురానికి 12 కి.మీల దూరంలో ఉంది. అందువల్ల ఇటు విశాఖపట్నం, అటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి స్క్రాప్ తరలించేందుకు అనువుగా ఉండనుంది.

రాజన్న ఆటోనగర్‌గా నామకరణం

ఇలా ఈ పార్కులో ఆటోమొబైల్, సర్వీస్ సెక్టార్ల యూనిట్ల ఏర్పాటు, స్క్రాప్ దుకాణాల తరలింపు వంటి వాటిపై ఫోకస్ పెట్టనున్నారు. దీనికి రాజన్న ఆటోనగర్‌గా నామకరణం చేయనున్నారు. మరోవైపు కణమాం ఎంఎస్‌ఎంఈ పార్కుకు కేటాయించిన భూమిలో ఉన్న సాగుదార్లకు పరిహారాన్ని కూడా బ్యాంకులో డిపాజిట్ చేశామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథ్ 'సాక్షి'కి చెప్పారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం పెదగంట్యాడ, గుర్రంపాలెం, అగనంపూడి, గంభీరంలలో ఇండస్ట్రియల్ పార్కులు, గుర్రంపాలెంలో ఎంఎస్‌ఎంఈ పార్కు, చినగదిలిలో హెల్త్‌సిటీ పార్కులతో పాటు గాజువాకలో ఆటోనగర్ ఉంది. కొత్తగా ఆటోనగర్‌గా ఏర్పాటు కానున్న కణమాం ఎంఎస్‌ఎంఈ పార్కు తొమ్మిదవది అవుతుంది.

పండుటాకులకు నిండు భరోసా

- ఫిర్యాదుదారుల ఇళ్లకు వెళ్లి పరిస్థితిని గమనించిన సీపీ రవిశంకర్
- తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లి విచారిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

దొండపర్తి: తమ పిల్లలే తమను వేధిస్తున్నారని తండ్రులు చేసిన ఫిర్యాదులపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ చలించిపోయారు. స్వయంగా ఫిర్యాదుదారుల ఇళ్లకు వెళ్లి విచారించారు. వాస్తవాలకు తెలుసుకుని తల్లిదండ్రులను వేధింపులకు గురి చేసినా, దాడులు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివరాలివీ.. సోమవారం నిర్వహించిన స్పందనలో ఆర్.ఆర్. వెంకటాపురం, ఆరిలోవ, రామజోగిపేట, కంచరపాలెం ప్రాంతాలకు చెందిన వృద్ధులు తమ కొడుకులు, కుటుంబ సభ్యులు ఆస్తులు తీసుకుని తమను వేధింపులకు గురి చేస్తున్నారని సీపీకి ఫిర్యాదులు చేశారు. వీరిలో రామజోగిపేటకు చెందిన 78 ఏళ్ల వృద్ధుడికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెయింటర్‌గా పనిచేస్తూ సంపాదించిన డబ్బుతో తన పిల్లలను చదివించి, పెళ్లిళ్లు చేశాడు. ఓ ఇల్లు కట్టుకుని తన పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. అతని భార్య చనిపోయినప్పటి నుంచి కొడుకులు, కోడళ్లు అతన్ని హింసించి, వేధింపులకు గురి చేస్తున్నారు. ఐదుసార్లు చంపడానికి ప్రయత్నించారని, ఈ నెల 20న దాడి చేశారని ఆయన తెలిపారు. దీనిపై అతని కుమార్తెలు వచ్చి అడగ్గా.. వృద్ధుడి రెండో కుమారుడు వారిపై అనుచితంగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీనిపై పెద్దాయన సీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో సీపీ సోమవారం రాత్రి ఫిర్యాదుదారిని ఇంటికి వెళ్లి విచారించారు. వాస్తవాలు తెలుసుకుని వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టం, 2007 యూ/ఎస్ 24 ప్రకారం వృద్ధులతో అనుచితంగా ప్రవర్తించినా.. మానసికంగా, ఆర్థికంగా లేదా శారీరకంగా ఇబ్బందులకు గురి చేసినా మూడు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ.5 వేలు వరకు జరిమానా లేదా రెండూ విధిస్తారని హెచ్చరించారు.

నేవీ డే వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో నేవీ అధికారులు, పలు శాఖల అధికారులు

మహారాణిపేట : నేవీ డే వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. నేవీ డే వేడుకల నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై నేవల్ కమాండ్, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని నగరంలో ఐదు చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. బీచ్ వద్ద లైఫ్ గార్డులను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. నేవీ డే రోజైన డిసెంబర్ 4న డ్రోన్లు, గాలిపటాలు ఎగుర వేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. వీక్షకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రాకపోకలు సాగించేందుకు అనువుగా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు పుష్కలంగా సమకూర్చాలని, బయో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. క్రిటికల్ కేర్ అంబులెన్స్, రెండు అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. బీచ్ సమీపంలోని ఏపీఐఐసీ స్థలంలో వీఐపీ పార్కింగ్ ఏర్పాటు చేసి, అక్కడ నుంచి నేరుగా బీచ్ రోడ్డులోకి వీఐపీలు చేరుకునే విధంగా తాత్కాలిక ద్వారం ఏర్పాటు చేయాలని సూచించారు. నేవీ, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రొటోకాల్ బాధ్యతలు నిర్వర్తించాలని ఆదేశించారు. కమాండర్ ఇన్ చీఫ్ (సి-ఇన్ -సి) హౌస్ వద్ద ఎట్ హోమ్ ఉంటుందని, అక్కడ పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ అంశాలపై నేవీ అధికారులతో చర్చించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సామాన్య ప్రజలు, ప్రముఖుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, లైఫ్ గార్డులను అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, నేవీ కెప్టెన్ బీపీ శేఖర్, కమాండర్లు వైకే కిశోర్, ఉదయ్ అగర్వాల్, జగమేద్ సింఘ్, ఆర్అండ్‌బి ఎస్ఈ కాంతిమతి, వీఎంఆర్డీఏ సెక్రటరీ డి.కీర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జీవీఎంసీ సీఈ బి.రవి కృష్ణంరాజు, ఏడీసీ శ్రీనివాసరావు, ఎస్ఈ వేణుగోపాల్, సమాచార పౌర సంబంధాల శాఖ జేడీ మణిరామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌నగర్‌లో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



సబ్‌స్టేషన్ శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

మద్దిపాలెం: రాష్ట్రంలో 28 విద్యుత్ సబ్‌స్టేషన్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే 16 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లాకు సంబంధించి ఆర్అండ్‌బీ దరి మాధవధార అంబేడ్కర్‌నగర్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేయగా.. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో పవర్ కట్‌లు లేవన్నారు. విద్యుత్ వ్యవస్థ పటిష్టానికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు అల్లు శంకరరావు, ఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా లక్ష్యం

- చిన్నపాటి తప్పు కూడా దొర్లడానికి వీలులేదు
- జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు జె.శ్యామలరావు
- స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 సమీక్ష



జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు జె.శ్యామలరావు, కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: చిన్నపాటి తప్పు లేకుండా కచ్చితమైన వివరాలతో కూడిన ఓటర్ల జాబితాను రూపొందించాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విశాఖ జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు జె.శ్యామలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. భవిష్యత్తులో అనుసరించాల్సిన విధానాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్రియలో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో విశాఖ జిల్లాకు ప్రత్యేకత ఉందని, అందరి దృష్టి దీనిపైనే ఉంటుందని తెలిపారు. డిసెంబర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఉన్నతాధికారులు రానున్నారని, అప్పటికి అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి అంశాన్ని ఎన్నికల కమిషన్ పరిశీలిస్తుందని అందరూ జాగ్రత్త వహించాలని చెప్పారు. చేస్తున్న ప్రతి పనికీ రికార్డు మెయింటైన్ చేయాలన్నారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో పారదర్శక విధానాలు పాటించాలని, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చే ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. జాబితా రూపకల్పనలో తప్పులు జరిగితే ఈఆర్వోలే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేక క్యాంపులు పెట్టి మరింత మంది యువ ఓటర్లకు అవకాశం కల్పించాలని సూచించారు.

ప్రతి విజ్ఞప్తికీ పరిష్కారం చూపిస్తాం

రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు, విజ్ఞప్తికీ నాణ్యమైన పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విశాఖ జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు జె.శ్యామలరావు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తప్పులతో కూడిన జాబితాలను రూపొందిస్తున్నారని, కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. కొన్ని చోట్ల అర్హత ఉన్నప్పటికీ ఓట్లను తొలగిస్తున్నారని టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు తప్పకుండా పరిష్కారం చూపిస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని జె.శ్యామలరావు పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఇప్పటివరకు రాజకీయ పార్టీల నుంచి వచ్చిన వినతులపై తీసుకున్న చర్యల గురించి వివరించారు. ఈ ఏడాది అక్టోబర్ 26వ తేదీ నాటికి జిల్లాలో 19,15,682 మంది ఓటర్లు ఉండగా డ్రాఫ్ట్ వెరిఫికేషన్ తర్వాత ఈనెల 26వ తేదీ నాటికి 19,15,316కు చేరుకున్నారని వివరించారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, ఆప్, బీఎస్పీ తదితర పార్టీల నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక క్యాంపుల ద్వారా ఓటర్ల చైతన్యం

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో అమలు చేసిన విధానాలు, సాధించిన ఫలితాల గురించి కలెక్టర్ మల్లికార్జున వివరించారు. యువ ఓటర్ల చేరిక, డెత్ ఓటర్ల తొలగింపు తదితర అంశాలను ప్రస్తావించారు. ఇప్పటి వరకు ఐదు లక్షలకుపైగా క్లెయిమ్స్‌ను పరిష్కరించామని పేర్కొన్నారు. జిల్లాలోని ఓటర్ల జాబితా వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి నెలా మొదటి శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు పెట్టి ఓటర్లను చైతన్య పరుస్తున్నామని, కొత్త ఓటర్లను చేరుస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఈఆర్వోలు లక్ష్మారెడ్డి, అఖిల, రామ్మోహన్ రావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ పాల్ కిరణ్, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

వర్తకుల షాపింగ్ కాంప్లెక్స్ సమస్య కొలిక్కి

- సింహగిరిపై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్లాన్‌కు వర్తకుల ఆమోదం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఆధ్వర్యంలో సమస్యకు పరిష్కారం


వర్త సంఘం నాయకులు, వర్తకులు, దేవస్థానం అధికారులతో మాట్లాడుతున్న ముత్తంశెట్టి

సింహాచలం: గత రెండు నెలలుగా నెలకొన్న సింహగిరి వర్తకుల షాపింగ్ కాంప్లెక్స్ సమస్య ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన ప్రసాద్ స్కీమ్ నిధులతో సింహగిరిపై ప్రస్తుతం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించి దాని స్థానంలో ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక చేసిన విషయం తెలిసిందే. అయితే వర్తకులకు దేవస్థానంకి మధ్య ఇప్పటి వరకు ప్రణాళిక విషయంలో సరైన ఒప్పందం కుదరకపోవడంతో దఫదఫాలుగా చర్చలు జరిగాయి. నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రణాళికలో పలుమార్లు మార్పులు చోటుచేసుకుంటూ వచ్చాయి. సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి కూడా వరక్తులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి వర్తకులకు అనుగుణంగా ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి ప్రణాళికను మార్పు చేశారు. ఆ ప్రణాళికను మంగళవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో నగరంలోని ఆయన స్వగృహంలో దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు, వర్తకుల సమక్షంలో పెట్టారు. వర్తకులు కోరిన విధంగా మెట్లను మార్చామని దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు ఎమ్మెల్యేకి వివరించారు. దేవస్థానం అధికారులు రూపొందించిన ప్రణాళికకు వర్తకులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ డిసెంబర్ 10 కల్లా విడతల వారీగా దుకాణాలను ఖాళీ చేసి అధికారులకు సహకరించాలని వర్తకులకు సూచించారు. వర్తకులు ఆమోదించిన ప్లాన్‌ను వెంటనే లిఖితపూర్వకంగా వారికి అందజేయాలని అధికారులకు సూచించారు. ఏఈఓ పాలూరి నరసింగరావు, సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్, ఉపాధ్యక్షుడు సానబోయిన రాజు, కోశాధికారి దొంతల శంకర్, వర్తకులు వరదా నరసింహమూర్తి, కస్తూరి సత్యనారాయణ, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరంబాబు ఉన్నారు.

పథకాల అమలులో అలసత్వం వద్దు

- గైర్హాజరైన అధికారులపై చర్యలు తప్పవు
- దిశ అధ్యక్షురాలు, అరకు ఎంపీ మాధవి


దిశ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు, అరకు ఎంపీ మాధవి, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జెడ్పీ సీఈవో పోలినాయుడు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో పక్కాగా కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, ఇందులో ఎటువంటి అలసత్వం చూపొద్దని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) అధ్యక్షురాలు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి ఆమె శాఖల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి సమీక్ష సమావేశాలకు జిల్లా అధికారులంతా తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రతీ మూడు నెలలకు ఓసారి సమీక్ష నిర్వహిస్తామని, వచ్చే సమావేశానికి అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరు కావాలని స్పష్టం చేశారు. తొలుత అటవీ, దివ్యాంగుల సంక్షేమం, నీటి పారుదల, ఐసీడీఎస్, జీవీఎంసీ, సమగ్ర శిక్ష, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, పౌర సరఫరాలు, డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీఈపీడీసీఎల్ తదితర శాఖలపై సమీక్షించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసి.. లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఆరోగ్య శ్రీ ట్రస్ట్ రిఫరల్ ఆస్పత్రుల వివరాలు అందరికీ తెలియజేయాలన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటికి అనుబంధంగా కొనసాగుతున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష జరిగిందన్నారు. దిశ అధ్యక్షురాలి ఆదేశాలు, సూచనలు తప్పక పాటించాలని, వచ్చే సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలని అధికారులకు స్పష్టం చేశారు. సమీక్షలో జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, డ్వామా పీడీ ఇ.సందీప్, జిల్లా అటవీ శాఖాధికారి అనంత్ శంకర్, గనుల శాఖ ఉప సంచాలకుడు రాజు, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ రవీంద్ర, వ్యవసాయం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డుమ్మా కొట్టిన అధికారులపై ఆగ్రహం

సమీక్షకు జాతీయ రహదారులు, బీఎస్ఎన్ఎల్, రైల్వే అధికారులెవరూ హాజరు కాలేదు. పర్యాటక శాఖ జిల్లా అధికారి రాలేదు. పలు శాఖల అధికారులు హాజరు కాకుండా కింది స్థాయి అధికారులు హాజరవ్వడంతో ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. డుమ్మా కొట్టిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వారికి నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో అనుమతి పొంది, బాధ్యత గల అధికారులను సమీక్షకు పంపాలని సూచించారు.

బాల్య వివాహాల అడ్డుకట్టకు పకడ్బందీ చర్యలు


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

మహారాణిపేట: సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 31, 39ల ద్వారా శక్తివంతమైన అస్త్రాలను అందించిందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, రెవెన్యూ, పోలీసు, విద్యా శాఖ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ.. బాల్య వివాహాలు జరగకుండా సంబంధిత కుటుంబ సభ్యులకు చట్టాలు, శిక్షలు, అపరాధ రుసుం, వివాహాలు జరిగితే తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. చట్టాన్ని ధిక్కరించి బాల్య వివాహాలు చేస్తే పోక్సో, ఇతర కేసుల నమోదుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ పీడీ డి.వెంకటేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో చట్టా న్ని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. అనంతరం బాల్య వివాహాలు నిలుపుదలలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల పాత్రపై రూపొందించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. బాలల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షురాలు ఎం.ఆర్.ఎల్.రాధ, జిల్లా బాల్య సంరక్షణాధికారి బి.హెచ్.లక్ష్మి, డీఎల్ఈవో కో-ఆర్డినేటర్ ఎం.ప్రసాద్, ఎంఈవోలు, దిశ పోలీస్ అధికారి కాంతారావు, సీడీపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గౌహతిలో తెలుగువారి నుంచి అపూర్వ ఆదరణ

అస్సాంలో పర్యటించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

చోడవరం: గౌహతిలో ఉన్న తెలుగువారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు. వ్యక్తిగత పర్యటన కోసం అస్సాం చేరుకున్న ఆయన అక్కడ ఉన్న తెలుగువారితో మంగళవారం సమావేశమయ్యారు. ఆయనకు అక్కడ ఘనస్వాగతం లభించింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన సుమారు 500 కుటుంబాలు అస్సాం రాష్ట్రం గౌహతిలో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో వారి మద్దతు కోరుతూ ధర్మశ్రీ వారితో సమావేశమయ్యారు. అస్సాంలోని తెలుగు వారు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తిస్థాయిలో మద్దతు పలికారని, సార్వత్రిక ఎన్నికల్లో తమ స్వగ్రామాలకు వచ్చి ఓట్లు వేశారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర సంక్షేమాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, ఆ పథకాలు కొనసాగాలంటే ఉమ్మడి విశాఖలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి అంతా కృషి చేయాలని కోరారు. ఎంతో సానుకూలంగా స్పందించిన అక్కడి తెలుగువారు.. ఈసారి కూడా వైఎస్సార్‌సీపీకి పూర్తిగా మద్దతు పలుకుతామని చెప్పారని ధర్మశ్రీ తెలిపారు. వారి సమస్యలు కొన్ని తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని పరిష్కరించడానికి జిల్లాలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్టు చెప్పారు. ప్రధానంగా గౌహతి వెళ్లే రైళ్లు అనకాపల్లి స్టేషన్‌లో ఆగకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పగా.. ఈ సమస్యను స్థానిక ఎంపీల దృష్టికి తీసుకెళతానని ధర్మశ్రీ చెప్పారు. విశాఖలో అస్సాం భవన నిర్మాణానికి స్థలం సమకూర్చాలని వారు కోరగా.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు చెప్పారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే


పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, చిత్రంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ నాయకులు

డాబాగార్డెన్స్: బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గ్రీన్‌పార్క్ హోటల్ కూడలిలోని పూలే విగ్రహానికి మంగళవారం కలెక్టర్ మల్లికార్జున, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులుతో కలిసి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలహీన వర్గాలు, బహుజనుల శ్రేయస్సు కోసం పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. కోలా గురువులు మాట్లాడుతూ పూలే చేసిన కృషి ఫలితంగా నేడు బడుగు వర్గాలు ఉన్నత స్థాయికి చేరుకోగలిగారని చెప్పారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, పార్టీ నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, పేడాడ రమణికుమారి, తుళ్లి చంద్రశేఖర్, లాడే కిశోర్, ఎస్సీ సెల్ నాయకుడు బోని శివరామకృష్ణ, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు యువశ్రీ, రీసు అనురాధ, నాయకులు గొలగాని రాము తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

కొమ్మాది: సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కోలా గురువులు పూలమాల వేసి నివాళులర్పించారు. అంటరానితనం, మహిళా విద్యాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు పిల్లా సుజాత సత్యనారాయణ, పేర్ల విజయచంద్ర, అప్పలకొండ, జోన్ ఇన్‌చార్జిలు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

హోటళ్లలో విజిలెన్స్ దాడులు

జగదాంబ: జగదాంబ దరి హేలాపూరి హోటల్‌లో ఎన్‌ఫోర్సుమెంట్ డీఎస్పీ స్వరూపరాణి, ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావు, సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. కోడి, మేక మాంసం, చేపలు నిల్వ ఉండడం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ నగరంలో పలు హోటళ్లలో బిర్యానీ, నాన్‌వెజ్ పదార్థాలు నిల్వ ఉంచి వేడి చేసి నాణ్యత లేకుండా అమ్మకాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీని వల్ల ప్రజారోగ్యానికి హాని కలుగుతుందన్నారు. హేలాపూరి హోటల్‌లో తమ సిబ్బంది తనిఖీ చేసిన సమయంలో వినియోగారులకు నిల్వ ఉన్న నాన్‌వెజ్ పదార్థాలు పెడుతుండడం గమనించినట్లు తెలిపారు. ఆహార పదార్థాలన్ని సీజ్ చేసి ఫుడ్‌క్వాలిటీ విభాగానికి పంపిస్తామన్నారు.

జీ షాన్ రెస్టారెంట్‌పై దాడులు

పీఎం పాలెం: శిల్పారామం జాతరకు సమీపంలోని జీ షాన్ రెస్టారెంట్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, సరఫరా చేస్తున్న ఆహారంలో బొద్దింకలు ఉంటున్నాయని ఫిర్యాదులు అందడంతో మంగళవారం విజిలెన్స్ సీఐ కోటేశ్వరరావు తనిఖీలు నిర్వహించారు. వంట గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. నిల్వ ఉన్న తందూరి, కల్మీ కబాబ్, చికెన్ జాయింట్ బిర్యానీని స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ నియామకాలపై ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: కేజీహెచ్‌లో నకిలీ అపాయింట్ ఉత్తర్వులపై సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ చర్యలు చేపట్టారు. 'కేజీహెచ్‌లో నకిలీ నియామకాల కలకలం' శీర్షికతో 'సాక్షి' మంగళవారం కథనం ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన ఆయన నకిలీ నియామకాలపై విచారణ చేపట్టాలని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. నకిలీ అపాయింమెంట్ ఉత్తర్వులు, ఇతర వివరాలను ఫిర్యాదుకు జత చేశారు.

దుర్గమ్మకు బంగారపు వస్తువుల విరాళం


బచ్చు మాధవీకృష్ణ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు విశాఖకు చెందిన సత్యనారాయణరెడ్డి, విజయ దంపతులు 47 గ్రాముల బంగారంతో బొట్టు, నత్తు, బులాకీలను సమర్పించారు. సత్యనారాయణరెడ్డి, విజయ దంపతులకు స్నేహితురాలైన దేవస్థాన పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ దంపతుల చేతుల మీదుగా ఆలయ ఈవో కేఎస్ రామారావుకు మంగళవారం బంగారపు ఆభరణాలను అందజేశారు. సుమారు 20.8 గ్రాముల బంగారు రాళ్లబొట్టు, 15.8 గ్రాముల బంగారంతో నత్తు, 10.7 గ్రాముల బంగారంతో బులాకీలను తయారు చేయించి దేవస్థానానికి అందించారు.

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతి

పరవాడ: తంతడి తీరంలో గల్లంతైన పరవాడ బీసీ కాలనీకి చెందిన 9వ తరగతి విద్యార్థి జంగాల రాజేష్(14) మృతదేహం మంగళవారం పూడిమడక తీరానికి చేరింది. ఈ నెల 26న పరవాడ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన నలుగురు స్నేహితులతో కలిసి రాజేష్ తంతడి తీరానికి వెళ్లాడు. ఆ రోజు మధ్యాహ్నం స్నేహితులతో కలిసి సముద్రంలో స్నానానికి దిగాడు. ఈ క్రమంలో భారీ అలకు కొట్టుకుపోయాడు. రాజేష్ కోసం రెండు రోజులుగా కుటుంబ సభ్యులు, పోలీసులు, నేవీ అధికారులు విస్తృతంగా గాలించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి విద్యార్థి జీవితం విషాదంగా ముగిసింది. పూడిమడక తీరానికి అతని మృతదేహం చేరింది. అలలకు రాజేష్ బలికావడంతో అతని తల్లిదండ్రులు సంతోషి, సత్యనారాయణ బోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం విద్యార్థి మృతదేహన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు.

జూ యానిమల్ కీపర్ల నిరసన

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న యానిమల్ కీపర్లు మంగళవారం నిరసనకు దిగారు. జూలో ఎలుగుబంటి దాడి చేయడంతో సోమవారం యానిమల్ కీపర్ నగేష్‌బాబు(23) మృతి చెందిన విషయం తెలిసిందే. అధికారుల నిర్లక్ష్య ధోరణితోనే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ జూ ప్రధాన ద్వారం వద్ద వీరంతా ఆందోళన చేశారు. యానిమల్ కీపర్లు రోజూ ఉదయం 8 గంటలకు జూకు చేరుకుని.. వన్యప్రాణులకు నైట్‌క్రాల్‌లోనే ఆహారం వేస్తారు. 9 గంటలకు సందర్శకుల కోసం డే క్రాల్‌లోకి విడిచిపెడతారు. మంగళవారం ఎప్పటిలాగే ఉదయం 8 గంటలకు జూకి చేరుకున్న యానిమల్ కీపర్లు.. ప్రధాన గేటు వద్దే ఆగిపోయారు. తమకు రక్షణ కల్పించాలని, నగేష్ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న క్యూరేటర్ నందనీ సలారియా వెంటనే జూకు చేరుకుని వారితో మాట్లాడారు. మీ డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించి.. 9.20 గంటలకు విధుల్లో చేరారు. నిరసన వల్ల వన్య ప్రాణులకు ఆహారం అందించడంలో గంటకు పైగా ఆలస్యమైంది. కాగా.. ఆరిలోవ పోలీసులు జూ పార్కును సందర్శించి.. నగేష్ మృతి పట్ల విచారణ చేపట్టారు. యానిమల్ కీపర్ల నుంచి వివరాలు సేకరించారు.